
MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక

ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 5 | సంచిక : 339 | మంగళవారం 28 అక్టోబర్ 2025 | పేజీలు : 4 | వెల : 3/-






# మొంథా తుఫాను అలజడి

సముద్రంలో ఎగిసిపడుతున్న అలలు

పలుచోట్ల నీట మునిగిన పొలాలు, నేరకొరిగిన చెట్లు

ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తం

రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ వర్షాలు

లోతట్టు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలింపు

సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిరంతరం సమీక్ష



**(అంకుశం ప్రతినిధి, అమరావతి, అక్టోబర్ 28):** మొంథా తుఫాను కారణంగా రాష్ట్రం వ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. చాటా చోట్ల పొలాలు నీటమునిగాయి. భారీ వృక్షాలు నేలకొరిగాయి. రవాణాకు ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రభుత్వ యంత్రాంగం ఎప్పటికప్పుడు స్పందించి లైన్ క్లియర్ చేస్తున్నారు. ముఖ్యంగా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో భారీ వర్షాలు కుస్తున్నాయి. ప్రభావంపై మంత్రులు, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు - మిగతా2లో



## మొంథా' తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు యంత్రాంగం సిద్ధంకండి

డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఇన్చార్జి మంత్రి వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

విద్యుత్, టెలికాం, తాగునీటి సరఫరాకు అంతరాయం రానివ్వొద్దు

డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్, ప్రత్యేక అధికారి,ఇతర శాఖల అధికారులతో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమీక్ష



**అంకుశం ప్రతినిధికోనసీమ, అక్టోబర్28:** తుఫాన్లు, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాలు సహజ సిద్ధంగా సంభవిస్తాయని వాటి వల్ల ప్రాణ, ఆస్తి నష్టాలకు తావు లేకుండా ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో వ్యవహరించాలని కోనసీమ జిల్లా ఇన్చార్జ్ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో ఆయన వివిధ శాఖల అధికారులతో మొంథా తుఫాన్ తీవ్రత, సహాయక చర్యలు, పునరావాస కేంద్రాల నిర్వహణ, రోడ్లు రాక పోకలు, విద్యుత్ సరఫరా అంశాలపై ప్రత్యేక అధికారి విజయరామరాజు, జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధ్యక్షతన సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం ఆస్తి, ప్రాణ నష్టాలకు ఆస్కారం లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలను, సహాయక చర్యలను వేగవంతం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారన్నారు. జిల్లాలో ఇప్పటికే తాడిచెట్టు పడి ఒక మహిళ మరణించడం దురదృష్టకరమన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలను అప్రమత్తం - మిగతా2లో

## వార్డెన్లు రాత్రిపూట హాస్టల్ విద్యార్థులతో కలిసి నిద్రించాలి

తుఫాన్ తీవ్రత దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలి

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ఎస్. సవిత



**(అంకుశం ప్రతినిధి, అమరావతి, అక్టోబర్ 28):** మొంథా తుఫాన్ నుంచి బీసీ హాస్టళ్లు, ఎంజేపీ స్కూళ్లో చదువుకునే విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుకుందామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రివర్యులు ఎస్.సవిత ఆదేశించారు. తుఫాన్ తీవ్రంగా ఉండే ప్రాంతాల్లోని విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని స్పష్టంచేశారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, ఎంజేపీ స్కూల్ కార్యదర్శి మాధవీలతతో మంత్రి సవిత మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మొంథా తుఫాన్ నేపథ్యంలో బీసీ హాస్టళ్ల విద్యార్థుల రక్షణకు తీసుకున్న చర్యల గురించి జిల్లాల వారీగా మంత్రి సవిత అడిగి తెలుసుకున్నారు. పలువురు డీబీసీడబ్ల్యూవోలతోనూ మంత్రి స్వయంగా ఫోన్ చేసి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి సవిత సవిత మాట్లాడుతూ, వార్డెన్లు, ఏబీసీడబ్ల్యూవోలు, ప్రిన్సిపాళ్లు - మిగతా2లో

## సీసీఐ ద్వారా రేపటి నుండి పత్తి కొనుగోలు కేంద్రాలు

8 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా



**(అంకుశం ప్రతినిధి, అమరావతి, అక్టోబర్ 28):** ప్రస్తుతం నెలకొన్న మొంథా తుఫాను తీవ్రత నేపథ్యంలో, రైతుల శ్రేయస్సు దష్ట్యా పత్తి కొనుగోలు కేంద్రాలు ఈనెల 29 బుధవారం అనగా రేపటి నుండి ప్రారంభించి, రైతుల వద్ద నుండి ప్రత్తి కొనుగోలు చేయవలసినదిగా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని వ్యవసాయ శాఖ మంత్రి కార్యాలయం మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ఈ ఏడాది 4.56 లక్షల హెక్టార్లలో పత్తి సాగు చేయగా సుమారు 8 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేయబడింది. కేంద్ర ప్రభుత్వం ప్రత్తికి క్వింటాలుకు రూ. 8,110 కనీస మద్దతు ధర అందించేలా రాష్ట్ర వ్యాప్తంగా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ద్వారా 30 ప్రత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగింది. రాయలసీమలో ప్రస్తుతం కొనుగోలు చేస్తూ రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లో తుపాను తగ్గిన తదనంతరం కొనుగోలు చేయడం జరుగుతుంది. పత్తి పంటను అమ్మదలచిన రైతులు ముందుగా రైతు సేవా కేంద్రాల ద్వారా తమ వివరాలను సీఎం యాప్‌లో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ద్వారా నమోదు చేసుకున్న తరువాత, 'కపాస్ కిసాన్" యాప్ లో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ - మిగతా2లో

# మొంథా' తుఫాన్ ను ఎదుర్కొనేందుకు యంత్రాంగం సిద్ధంకండి

-మొదటిపేజీ తరువాయి

చేయాలని సూచించారు. ప్రకృతి విపత్తుల పట్ల వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో స్వయంగా పర్యవేక్షిస్తూ నష్టాలు తీవ్రతను తగ్గించడంలో ముఖ్యమంత్రి వర్యులకు ఎంతో అనుభవం ఉందని, హుదూద్ వంటి పలు తుఫానుల ద్వారా గడించారన్నారు. అదే స్ఫూర్తితో తుఫాన్ తీవ్రత వల్ల జరిగే నష్టాలను పూర్తిగా నివారించి ప్రభుత్వానికి మంచిపేరు తేవాలన్నారు. పూరి గుడిసెలు, పక్కా గృహాలు సముద్ర తీరానికి ఒక కిలోమీటర్ పరిధిలో నివాసముంటున్న వారందరినీ పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. చాలామంది అవగాహన లేని కారణంగా ఇల్లు విడిచి బయటకు రావడానికి ఇష్టపడరని, అయినప్పటికీ వారి యోగక్షేమాలను కోరుతూ బలవంతంగానైనా తరలించాలన్నారు. మొంథా తుఫాను నేటి (మంగళవారం) సాయంత్రం 5 గంటలు రాత్రి 10 గంటల మధ్య రాజోలు సమీప ప్రాంతంలో తీరాన్ని దాటే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించినట్లు మంత్రివర్యులు తెలిపారు. జిల్లా ప్రజానీకానికి టైం టు టైం వరద హెచ్చరికల సమాచారాన్ని అందిస్తూ... అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ఈదురుగాలుల తీవ్రత క్రమంగా పెరుగుతోందని ప్రజలు అప్రమత్తం కావాలన్నారు. అందరినీ పునరావాస కేంద్రాలకు తీసుకువచ్చి రేపు సాయంత్రం వరకు పునరావాస కేంద్రాలలో ఆశ్రయం కల్పించి రాత్రి భోజనం అనంతరం తిరిగి ప్రభుత్వం ప్రకటించిన రూ 3 వేల ఆర్థిక సహాయాన్ని, మత్స్యకార నిర్వాసితులకు ఉచితంగా 25 కేజీల బియ్యాన్ని అందించి ఇంటికి బాధితులను పంపించాలన్నారు. ప్రత్యేక అధికారులు జిల్లా కలెక్టర్ సూచనలతో జనరేటర్లు అవసరమైన చోట ఏర్పాటు చేసుకొని వాటికి అవసరమైన డీజిల్ ను కూడా సరఫరా చేస్తామని తెలిపారు. ఎవరికి ఇబ్బంది లేకుండా సహాయక చర్యలు చేపట్టాలన్నారు జిల్లాలో నిరాశ్రయులైన వారందరికీ ఆర్థిక సహాయం అందించాలన్నారు. తుఫాన్ అనంతరం రోడ్లపై పడిపోయిన చెట్లు తొలగిస్తూ రాకపోకలు, అదేవిధంగా నేలకోరిగిన విద్యుత్ స్తంభాలు నెలకొల్పి విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్లమెంట్ సభ్యులు జి హరీష్ మాధుర్, స్థానిక శాసనసభ్యులు అయితా బత్తుల ఆనందరావు, ముమ్మిడివరం శాసనస భ్యులు దాట్ల సుబ్బరాజు, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, జిల్లా జాయింట్ కలెక్టర్ నిశాంతి, డిఆర్ఓ కే.మాధవి, ఆర్ అండ్ బి, ఆర్ డబ్ల్యు ఎస్, అగ్నిమాపక విపత్తుల స్పందన, పంచాయతీరాజ్ విభాగాల అధికారులు, ఇంజనీర్లు పాల్గొన్నారు



తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటన డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను మంత్రి అచ్చెన్నాయుడు విస్తృతంగా పర్యటించారు. అమలాపురం పరిసర ప్రాంతాల్లో తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉండటంతో, మంత్రి స్వయంగా అక్కడి పరిస్థితులను సమీక్షించారు. ఓడరేవు పునరావాస కేంద్రాలను ప్రత్యక్షంగా పరిశీలించిన మంత్రి, అక్కడ ఉన్న ప్రజలతో స్వయంగా మాట్లాడి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ప్రజలు ఎవ్వరూ ఆందోళన చెందవలసిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. పునరావాస శిబిరాల్లో తాగునీరు, భోజనం, వైద్య సదుపాయాలు సమృద్ధిగా ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రజల అవసరాలపై నిరంతరం మానిటరింగ్ జరుగుతోంది అని చెప్పారు. మొంథా తుఫాన్ ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయడం అత్యవసరం. పునరావాస కేంద్రాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాను అని మంత్రి తెలిపారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని విజ్ఞప్తి చేస్తూ, ప్రభుత్వం ప్రతి ఒక్కరికి అండగా ఉంటుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఇది శుభవార్త. లక్షలాది మంది ఎదురుచూస్తున్న 8వ కేంద్ర వేతన సంఘం ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన మంగళవారం సమావేశమైన కేంద్ర కేబినెట్.. 8వ వేతన సంఘం ఏర్పాటుకు సంబంధించిన విధివిధానాలకు ఆమోదముద్ర వేసింది. దీంతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, పెన్షనర్ల చెల్లింపుల పెంపుపై ఈ కమిషన్ త్వరలో తన పనిని ప్రారంభించనుంది.

ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా సుమారు 50 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 65 లక్షల మందికి పైగా పెన్షనర్లకు లబ్ధి చేకూరనుంది. వేతన సంఘం ఒక తాత్కాలిక వ్యవస్థలా పనిచేస్తుంది. ఇందులో ఒక ఛైర్‌పర్సన్, ఒక పార్ట్‌టైమ్ సభ్యుడు, ఒక మెంబర్-సెక్రటరీ ఉంటారు. ఈ కమిషన్ తన నియామకం జరిగిన తేదీ నుంచి 18 నెలల్లోగా ప్రభుత్వానికి తన సిఫార్సులను సమర్పించాల్సి ఉంటుంది. అవసరమైతే, తుది సిఫార్సులకు ముందే మధ్యంతర



నివేదికలు కూడా ఇచ్చే వెసులుబాటును కల్పించారు. సిఫార్సులు చేసేటప్పుడు కమిషన్ పలు కీలక అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని కేబినెట్ నిర్దేశించింది. దేశ ఆర్థిక పరిస్థితి, ఆర్థిక క్రమశిక్షణ ఆవశ్యకత, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు నిధుల లభ్యత వంటి అంశాలను పరిశీలించనుంది. అలాగే, ఈ సిఫార్సుల ప్రభావం రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక వ్యవస్థపై ఎలా ఉంటుందో కూడా అంచనా వేయనుంది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేట్ రంగంలోని ఉద్యోగుల జీతభత్యాలు, పని పరిస్థితులను కూడా దృష్టిలో ఉంచుకుని నివేదిక రూపొందించాల్సి ఉంటుంది. సాధారణంగా ప్రతి పదేళ్లకు ఒకసారి కేంద్ర ప్రభుత్వం వేతన సంఘాన్ని ఏర్పాటు చేస్తుంది. ఉద్యోగుల జీతభత్యాలు, పదవీ విరమణ ప్రయోజనాలు, ఇతర సేవా నిబంధనలను సమీక్షించి, వాటిలో మార్పులను సూచించడం ఈ కమిషన్ ప్రధాన విధి. ఈ క్రమంలో, 8వ వేతన సంఘం సిఫార్సులు 2026 జనవరి 1 నుంచి అమల్లోకి వస్తాయని అంచనా వేస్తున్నారు. 7వ వేతన సంఘాన్ని 2014 ఫిబ్రవరిలో ఏర్పాటు చేయగా, దాని సిఫార్సులను ప్రభుత్వం 2016 జనవరి నుంచి అమలు చేసిన విషయం తెలిసిందే. 8వ వేతన సంఘం ఏర్పాటుపై ప్రభుత్వం 2025 జనవరిలో ప్రకటన చేసింది. తాజాగా కేబినెట్ ఆమోదంతో ఈ ప్రక్రియ అధికారికంగా ముందుకు సాగనుంది.

# ఆరెస్సెస్ కార్యకలాపాలపై ఆంక్షలు.. సిద్ధరామయ్య ప్రభుత్వానికి హైకోర్టులో చుక్కెదురు

**ఆరెస్సెస్ కార్యకలాపాలకు ముందస్తు అనుమతిని తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు**

**రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులపై మధ్యంతర స్టే విధించిన హైకోర్టు**

**తదుపరి విచారణ 17వ తేదీకి వాయిదా**

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కార్యకలాపాల వ్యవహారంలో కర్ణాటక ప్రభుత్వానికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్రంలో ఆరెస్సెస్ తదితర సంస్థల కార్యకలాపాలకు ముందస్తు అనుమతిని తప్పనిసరి చేస్తూ సిద్ధరామయ్య ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులపై హైకోర్టు మంగళవారం మధ్యంతర స్టే విధించింది. తదుపరి విచారణను హైకోర్టు సింగిల్ జడ్జి బెంచ్ నవంబర్ 17వ తేదీకి వాయిదా వేసింది. ఆరెస్సెస్ ఏర్పడి వందేళ్లయిన నేపథ్యంలో భారీస్థాయిలో కవాతులు నిర్వహించేందుకు రాష్ట్ర బీజేపీ నాయకులు సిద్ధమయ్యారు. ఈ తరుణంలో సిద్ధరామయ్య ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రైవేటు సంస్థలు, సంఘాలు తమ కార్యకలాపాల కోసం ప్రభుత్వ మైదానాలు, రహదారులు, బహిరంగ ప్రదేశాలు, విద్యాసంస్థల ఆవరణలను వినియోగించుకోవాలంటే ముందస్తు అనుమతి తప్పనిసరి చేసింది. ఈ మేరకు అక్టోబర్ 18న కర్ణాటక ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తర్వులను ఎవరైనా ఉల్లంఘిస్తే



చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం అన్ని జిల్లాల యంత్రాంగాలను ఆదేశించింది. అయితే రాష్ట్రంలో అరెస్సెస్‌ను నిషేధించే ఉద్దేశంతో సిద్ధరామయ్య ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని బీజేపీ ఆరోపిస్తోంది. ఈ క్రమంలోనే ప్రభుత్వ ఉత్తర్వులను సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది.

# 'భజనలో.. గోల్డ్ మెడల్ నీకేపో!'

ఒకవేళ భజన అనే పోటీ గనుక ఒలింపిక్స్‌లో ఉండి ఉంటే.. పాకిస్తాన్‌కు కచ్చితంగా ఆ పోటీల్లో గోల్డ్ మెడల్ వచ్చి తీరేదేమో!. విన్నర్ పోడియంలో ఎవరికీ అందనంత ఎత్తులో ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఉండి ఉండేవారేమో!.. ఈ మాటలు అంటోంది ఆ దేశ మాజీ దౌత్యవేత్త హుస్సేన్ హక్కానీ. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మరోసారి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై విపరీతమైన ప్రశంసలు గుప్పించాడు. కంబోడియా-థాయ్‌లాండ్ మధ్య తాజాగా కౌలాలంపూర్ ట్రంప్ సమక్షంలో శాంతి ఒప్పందం కుదరింది. ఈ నేపథ్యంలో.. శాంతి, స్థిరత్వానికి కృషి చేసే నాయకుండంటూ పాక్ ప్రధాని విపరీతమైన పొగడ్తలు గుప్పించారు. మొన్న గాజా శాంతి ప్రణాళిక.. ఇప్పుడేమో ఇది. మధ్యప్రాచ్యం, దక్షిణాసియాలో శాంతి కోసం ట్రంప్ చేసిన కృషి ప్రపంచాన్ని రక్షించింది. లక్షల మంది ప్రాణాలు



పోకుండా నిలబెట్టింది అని షెహబాజ్ పేర్కొన్నారు. దీనిపై పాకిస్తాన్ మాజీ అమెరికా రాయబారి హుస్సేన్ హక్కానీ, షెహబాజ్ షరీఫ్‌పై వ్యంగ్యంగా స్పందించారు. పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ట్రంప్‌ను పొగడటంలో ఒలింపిక్ గోల్డ్ మెడల్ గెలిచే స్థాయిలో ఉన్నారంటూ ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. ఫరీద్ జకారియా వ్యాఖ్యలను ఉటంకిస్తూ.. 'ఇది ఒలింపిక్ క్రీడ అయితే, షరీఫ్ పోడియం మీద గోల్డ్ మెడల్‌తో నిలిచేవారు అని అన్నారు. ఈజిప్ట్‌లో జరిగిన గాజా శాంతి సదస్సులోనూ షరీఫ్ ట్రంప్‌ను విపరీతంగా పొడిగారు. ట్రంప్‌ను శాంతి పురుషుడిగా అభివర్ణిస్తూ నోబెల్ శాంతి బహుమతికి అర్హుడంటూ మాట్లాడారు. ఆ సమయంలో ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ చిత్రమైన హావభావాలు ప్రదర్శించడం విపరీతంగా వైరల్ అయ్యింది. షరీఫ్ మాటలతో కడుపు నిండిపోయిన ట్రంప్ 'ఇక మాట్లాడేం లేదని, ఇంటికి వెళ్లిపోదాం' అంటూ వ్యంగ్యంఆ స్పందించడం మరో కొసమెరుపు. అయితే షెహబాజ్ షరీఫ్ వ్యాఖ్యలను పాక్ పౌరులే భరించలేకపోయారు. అంతలా దిగజారి పొగడాల్సిన అవసరం ఏముందంటూ.. ప్రధానిని తిట్టిపోశారు కూడా.

## మొంథా తుఫాను అలజడి..



-మొదటిపేజీ తరువాయి

మంగళవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రాణనష్టం లేకుండా... ఆస్తినష్టం ఎక్కువ జరగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలి. ముందస్తు జాగ్రత్తలు, సహాయక చర్యలు, పునరావాసం, నష్టం అంచనా అనే అంశాలపై అధికారులు ఫోకస్ పెట్టాలి. కాల్వలు, చెరువులకు గండిపడకుండా చూడండి.. నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండండి. లంక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయండి... రిలీఫ్ క్యాంపులకు తరలించండి. తుఫాను ప్రభావం వల్ల కరెంట్ కట్ చేయాల్సి రావచ్చు... ముందుగానే ప్రజలకు క్యాండిళ్లను సరఫరా జరిగేలా చూడండి. తీరం దాటిన తర్వాత కూడా భారీ వర్షాలు పడే అవకాశం ఉంది.. అలెర్టుగా ఉండండి. పునరావాస శిబిరాల్లో ఉండేవారికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలి. అధికారులు%-%ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలి. సమస్య ఉందనుకున్న ప్రాంతాల్లో అధికారులు, ప్రజా ప్రతినిధులు ఉండాలి... క్షేత్ర స్థాయిలో ప్రజా ప్రతినిధులు ఉంటే.. ప్రజలకు భరోసా ఇచ్చినట్టు అవుతుంది. భారీ వర్షాల వల్ల పడే నీరు నిల్వ ఉండకుండా.. కాల్వలు, డ్రైన్ల ద్వారా నీటిని బయటకు పంప్ చేయాలి. విజయవాడ, ఏలూరు, భీమవరం వంటి ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోకుండా గట్టి చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లోపం అనేది ఉండకూడదు. రైతులకు తుఫాన్ అలెర్టులు ఎప్పటికప్పుడు చేరేలా చూడాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో మంత్రులు అనిత, నారాయణ, అనగాని సత్యప్రసాద్, సీఎస్ కె.విజయానంద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఇతర శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## వార్డెన్లు రాత్రిపూట హాస్టల్ విద్యార్థులతో కలిసి నిద్రించాలి

-మొదటిపేజీ తరువాయి

24 గంటలూ హాస్టళ్లలో ఉండడడంతో పాటు రాత్రి సమయంలో విద్యార్థులతో కలిసి నిద్రపోయేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న హాస్టళ్ల విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో విద్యార్థులకు కాచి చల్లార్చిన నీరు, తాజా ఆహారం మాత్రమే అందివ్వాలన్నారు. బయట ఆహారాలను హాస్టళ్లలోకి అనుమతించొద్దన్నారు. తుఫాన్ నేపథ్యంలో విద్యుత్ కోతలు ఉండే అవకాశముందని, ఇన్వర్టర్లను పొదుపుగా వాడుకోవాలని తెలిపారు. టార్చిలైట్లు, క్యాండిల్స్, అగ్గి పెట్టెలను పెద్ద మొత్తంలో ముందు జాగ్రత్తగా సమకూర్చుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్ల ఆదేశాలను తూ.చ. తప్పకుండా పాటించాలన్నారు. విద్యార్థుల్లో అనారోగ్య లక్షణాలు కనిపిస్తే తక్షణమే సమీపంలో ఉన్న పీహెచ్సీ వైద్యులతో వైద్య సేవలందించాలన్నారు. హాస్టళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు బ్లీచింగ్ చేయాలని స్పష్టంచేశారు. మరుగుదొడ్లు, బాత్ రూమ్ లను శుభ్రం చేయాలన్నారు. దోమలు చొరబకుండా హాస్టళ్ల గదుల కిటికీల వద్ద మెస్ లు ఏర్పాటు చేయాలన్నారు. తుఫాన్ దష్ట్యా హాస్టళ్లను, ఎంజేపీ స్కూళ్లను నిరంతరం పర్యవేక్షించాలని, ఎప్పటికప్పుడు వాటి స్థితిగతులు, విద్యార్థుల ఆరోగ్యంపై నివేదిక ఇవ్వాలని బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణను, ఎంజేపీ స్కూల్ కార్యదర్శి మాధవీలతను మంత్రి సవిత ఆదేశించారు. హాస్టళ్ల విద్యార్థులను కన్నబిడ్డల్లా చూసుకోవాలని, వారిని కంటికి రెప్పలా కాపాడుకోవాలని స్పష్టంచేశారు. ఈ సమావేశంలో పలువురు బీసీ సంక్షేమ శాఖాధికారులు పాల్గొన్నారు.

## సీసీఐ ద్వారా రేపటి నుండి పత్తి కొనుగోలు కేంద్రాలు

-మొదటిపేజీ తరువాయి

ద్వారా అమ్ముకోదలచిన రోజు స్లాట్ బుక్ చేసుకొని, స్లాట్ ప్రకారం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలకు లోబడి యాప్ లో సూచించబడిన కొనుగోలు కేంద్రాల ద్వారా (వాటి పరిదిలోకి వచ్చే జిన్నింగ్ మిల్లుల ద్వారా) అమ్ముకోవలసిందిగా తెలియజేస్తున్నాం. ఇందుకు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ లు రైతులకు పూర్తిగా సహకరించే విధంగా వ్యవసాయశాఖ జిల్లా వ్యవసాయ అధికారులను ఆదేశించడమైంది. అంతే కాకుండా జిల్లా వ్యవసాయ మరియు మార్కెటింగ్ అధికారులు తగు సూచనలను దిగువ స్థాయి సిబ్బందికి ఇస్తూ, పర్యవేక్షించి ప్రత్తి కొనుగోలు విజయవంతంగా పూర్తి చేయవలసినదిగా వ్యవసాయ శాఖ మంత్రి కార్యాలయం వారు ఆ ప్రకటనలో తెలియజేశారు.

## తీరానికి చేరువవుతున్న మొంథా.. భారత రైల్వే శాఖ అప్రమత్తం

'మొంథా' తుఫాను ముంచుకొస్తుండటంతో భారత రైల్వే శాఖ అప్రమత్తమైంది. తక్షణ చర్యలు చేపట్టేందుకు వీలుగా తెలుగు రాష్ట్రాల్లో, ఒడిశాలో డివిజనల్ వార్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఉన్నతాధికారులను ఆదేశించారు. తుఫాను ప్రభావిత ప్రాంతాలైన దక్షిణ మధ్య రైల్వే, ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. తుఫాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రైల్వే శాఖ సర్వసన్నద్ధంగా ఉండాలని సూచించారు. ప్రత్యేకించి విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం డివిజన్ల పరిధిలో అవసరమైన యంత్రాలు, సామగ్రితోపాటు సిబ్బందిని తక్షణమే అందుబాటులో ఉంచాలన్నారు. తుఫాను వల్ల ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి తీసుకుంటున్న చర్యలపై అధికారుల నుంచి నివేదిక కోరారు. తుఫాను పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టంచేశారు. అత్యవసర పరిస్థితులు తలెత్తితే తక్షణం స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. తుఫాను కారణంగా రైళ్ల రాకపోకలకు అంతరాయం కలుగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టిసారించాలని పేర్కొన్నారు.

## ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరంగా పాకిస్థాన్‌లోని లాహోర్

పాకిస్థాన్‌లోని లాహోర్ నగరం మరోసారి వాయు కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. మంగళవారం దట్టమైన పొగమంచు (స్మాగ్) నగరాన్ని కమ్మేయడంతో, ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరంగా నిలిచింది. స్విస్ ఎయిర్ క్వాలిటీ మానిటర్ 'ఐక్యూఎయిర్' ప్రకారం, మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో లాహోర్ వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ) 329గా నమోదైంది. అంతకుముందు ఉదయం లాహోర్ ఏక్యూఐ 424 వద్ద ఉందని, ఆరోగ్యానికి అత్యంత హానికరమైన పీఎం 2.5 కణాల స్థాయి 287గా నమోదైందని పాకిస్థాన్ పత్రిక 'ది న్యూస్ ఇంటర్నేషనల్' నివేదించింది. లాహోర్‌తో పాటు, కరాచీ నగరం కూడా ప్రపంచంలోని అత్యంత కాలుష్య నగరాల జాబితాలో మూడో స్థానంలో నిలిచింది. ఇక్కడ ఏక్యూఐ 174గా రికార్డయింది. ఈ స్థాయిలో కాలుష్యానికి ఎక్కువసేపు గురికావడం వల్ల గుండె జబ్బులు, ఊపిరితిత్తుల క్యాన్సర్, స్ట్రోక్, దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. నగరంలోని

## "మొంథా" తుఫాను వలన కురుస్తున్న భారీ వర్షాలకు ఏలేరు డ్రైయిన్ వరద నీరు పెరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే నల్లమిల్లి




**కాకినాడ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ అక్టోబర్ 28:** కాకినాడ జిల్లా పెదపూడి మండలం ఏపీత్రయంలో "మొంథా" తుఫాను వలన కురుస్తున్న భారీ వర్షాలకు ఏలేరు డ్రైయిన్ నీటి ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో ఆ ప్రాంతాన్ని పరిశీలించి, ఈరోజు ,రేపు గుర్రపు డెక్క, తూడు పెరిగే అవకాశం ఉన్నందున్న ఎప్పటికప్పుడు తొలగించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించిన అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి. ఈ కార్యక్రమంలో పెదపూడి మండల,ఏపీ త్రయం గ్రామ కూటమి నాయకులు, రైతులు,అధికారులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే సత్తి కి కోస్తా ఆంధ్ర రెడ్డి సంక్షేమ సంఘ వన సమారాధన కు ఆహ్వానం



- కోస్తాఆంధ్రా రెడ్డిసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన

**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ అక్టోబర్ 28:** నవంబర్ 2వ తేదీన అనపర్తిలో కోస్తాఆంధ్రా రెడ్డిసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించబడనున్న కార్తీక వన సమారాధన కార్యక్రమానికి అనపర్తి మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో కోస్తా ఆంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు త్రినాథ్ రెడ్డి, తాడి చంద్రశేఖర్ రెడ్డి, మల్లిడిసూరారెడ్డి,కొప్పవరం రెడ్డి సంఘం అధ్యక్షుడు విజయభాస్కరరెడ్డి, సత్తి వెంకటరెడ్డి(బుల్లితమ్ముడు),కర్రి సత్యన్నారాయణరెడ్డి(KSN), మరికొందరు రెడ్డి సోదరులు పాల్గొన్నారు.

## ఎస్ .హెచ్. ఓ .లో నవంబర్ నెల అంతా మధుమేహ నిరోధక ప్రజా చైతన్య కార్యక్రమాలు "

**అంకుశం న్యూస్ గుంటూరు అక్టోబర్ 28:** మధుమేహం నిరోధక మాసం సందర్భంగా నవంబర్ ఒకటవ తేదీ నుండి 30వ తేదీ వరకు సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మధుమేహ నిరోధక , ఆరోగ్య పరిరక్షణ ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు, అధ్యక్షులు డాక్టర్ టి .సేవకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు . నవంబర్ నెలలో వచ్చిన ఐదు ఆదివారాలలో ఆయా విభాగాలలో ప్రత్యేక నిపుణులైన ఎండోక్రైనాలజిస్ట్, నెఫ్రాలజిస్ట్, కార్డియాలజిస్ట్, ఫిజియోథెరపిస్ట్, న్యూరాలజిస్ట్ లతో మధుమేహం వల్ల వచ్చే సమస్యల పైన, నిరోధక చర్యల పైన శాస్త్రీ అవగాహన సభలు, ఉచిత వైద్య సలహా శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. అంతేకాక నవంబర్ ఒకటవ తేదీ నుండి 30వ తేదీ వరకు మధుమేహ అనుమానితులకు, బాధితులకు అత్యంత అతి తక్కువ ఖర్చుతో(రూ.1250/-) డయాబెటిక్ ప్రొఫైల్ -విటమిన్ డి,బి12లతో కలిపి మొత్తం 86 పరీక్షలు నిర్వహించి ,ఉచిత వైద్య సలహాలు అందజేస్తామన్నారు .నేడు వేగంగా వ్యాప్తి చెందుతున్న మధుమేహ నిరోధంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని డాక్టర్ టి.సేవకుమార్ పిలుపునిచ్చారు. మధుమేహం నిరోధమే లక్ష్యంగా శాస్త్రీయ అవగాహన సభలు నిర్వహించదలచిన విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ,ఇతర సంస్థలు 2/1 బ్రాడీపేట లోని ఎస్ .హెచ్. ఓ కార్యాలయం(మొబైల్ :9848391212)లోసంప్రదించవచ్చునని డాక్టర్ టి.సేవకుమార్ తెలిపారు.

## మురికి కాలువలు నిండి పోయాయి. చర్యలు తీసుకోండి



**అంకుశం న్యూస్ ధర్మవరం అక్టోబర్ 28:** ధర్మవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ గౌరవనీయులు శ్రీ పరిటాల శ్రీరామ్ అన్నగారు ఆదేశాల మేరకు 14వ వార్డులోని దుర్గం గుడి దగ్గర మేద స్ట్రీట్ లో కాలువలు నిండుకుపోయినాయే కాలువలు పైన బాత్రూములు కట్టిన దాని వల్ల అవి ఇబ్బందిగా ఉంది అవన్నీ తొలగించవలసిందిగా మునిసిపల్ కమిషనర్ గారికి కాలువలు పైన బాత్రూములు కట్టిన దాని వల్ల అవి ఇబ్బందిగా ఉంది అవన్నీ తొలగించవలసినది గా ధర్మవరం మునిసిపల్ కమిషనర్ కి టీడీపీ నాయకులు కిరోసిన్ పోతలయ్య విజ్ఞప్తి చేశారు.

## టీడీపీ నేతకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పరిటాల శ్రీ రామ్........



**అంకుశం న్యూస్ ధర్మవరం అక్టోబర్ 28:** ధర్మవరం టీడీపీ నాయకులు శ్రీ శైలం పురుషోత్తం గౌడ్ జన్మదినం సందర్భంగా మంగళవారం ధర్మవరం నియోజకవర్గం టీడీపీ ఇంచార్జి యువ నేత పరిటాల శ్రీ రామ్ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసారు. ధర్మవరం తెలుగుదేశం పార్టీ కి అంకిత భావం తో సేవలు చేస్తున్నందుకు పురుషోత్తం గౌడ్ ని అభినందించారు. అదేవిధంగా ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో రాష్ట్ర ఆగ్రో డైరెక్టర్ కమతం కాటమయ్య, పట్టణ టీడీపీ అధ్యక్షులు పరిసే సుధాకర్ మహేష్ చౌదరి, తెలుగు యువత జి. విజయ్ చౌదరి, తిరుమలేష్, చింత పులుసు పెద్దన్న, కిరోసిన్ పోతలయ్య, కత్తుల బాబ్జి, శ్రీ మతి కత్తుల సునీత, తెలుగు మహిళలు తదితరులు వున్నారు.

# ఎస్సీ ల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం





- : విజిలెన్స్ & మానిటరింగ్ కమిటీ సమావేశాలు క్రమం తప్పకుండా ప్రభావవంతంగా జరగాలి
- : ఆంధ్రప్రదేశ్ శాసనసభ కమిటీ అధ్యక్షులు కుమార్ రాజా వర్ల

**అంకుశం ప్రతినిధి అనంతపురం, అక్టోబర్ 28 :** ఎస్సీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆంధ్రప్రదేశ్ శాసనసభ కమిటీ అధ్యక్షులు కుమార్ రాజా వర్ల స్పష్టం చేశారు. అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవన్ లో మంగళవారం షెడ్యూల్డ్ కులాల సంక్షేమము కొరకు ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ శాసనసభ కమిటీ అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జిల్లా ఎస్పీ పి.జగదీష్ లతో కలిసి ఆంధ్రప్రదేశ్ శాసనసభ కమిటీ అధ్యక్షులు కుమార్ రాజా వర్ల గారు పాల్గొనగా.. కమిటీ సభ్యులు కావలి గ్రీష్మ ప్రసాద్, ఎమ్మెస్ రాజు, విజయ్ కుమార్ బి.ఎన్, రోషన్ కుమార్ సొంగ, తదితరులు పాల్గొన్నారు. ముందుగా భారత రాజ్యాంగ నిర్మాత డా.బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి ఆంధ్రప్రదేశ్ శాసనసభ కమిటీ అధ్యక్షులు, కమిటీ సభ్యులు, జిల్లా కలెక్టర్, ఎస్పీలు పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా శాసనసభ కమిటీ అధ్యక్షులు కుమార్ రాజా వర్ల మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16 నెలల్లోనే అనంతపురం జిల్లాలో పర్యటించి షెడ్యూల్డ్ కులాలకు చెందిన ప్రజలు మరియు షెడ్యూల్డ్ కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు మరియు కార్యకర్తలు ఇచ్చే వినతి పత్రాలు స్వీకరించడం జరిగిందని, వాటిని మినిట్స్ రూపంలో రికార్డ్ చేసి శాసనసభకు అందజేస్తామన్నారు. సంక్షేమ పథకాల అమలు, పెండింగ్లో ఉన్న అట్రాసిటీ కేసుల స్థితి, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ స్థితి తదితర అంశాలపై నివేదికలను అందించడం జరుగుతుందన్నారు. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చాలా సీరియస్ గా దృష్టి సారించారని, ఎస్సీల అభివృద్ధి కోసం 20,000 కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయించడం జరిగిందని, వారి కోసం ఎస్సీ సబ్ ప్లాన్ ఏర్పాటుచేసి వారి అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తున్నామన్నారు. అట్రాసిటీ కేసులకు సంబంధించి బాధితులకు పునరావాసం కల్పించడం, ఆర్థికంగా ఆదుకోవడం లాంటి చర్యలను సీరియస్ గా తీసుకోవాలని, తీవ్రత ఎక్కువ ఉన్న కేసులకు సంబంధించి వారి కుటుంబాలకు భూమిని నిబంధనల మేరకు కేటాయించాలని, ఇవ్వడం చేయాలని ఆదేశించారు. నూతనంగా ఎస్సీ హాస్టల్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరిగిందని, మరింత మంది ఎస్సీ విద్యార్థులు హాస్టల్స్ లోకి వచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ఎస్సీ కమ్యూనిటీకి స్మశాన వాటికలకు అవసరమైన స్థలం, రహదారి ఏర్పాటు, కాంపౌండ్ వాల్స్ ఏర్పాటు విషయమై క్షేత్రస్థాయి నుంచి ఆర్డీవోలు, తహసిల్దారులు ప్రతిపాదనలు పంపించాలన్నారు. సిఎస్ఆర్ లేదా ఇతర నిధుల నుండి స్మశాన వాటికల్లో కాంపౌండ్ వాల్స్, చేతి పంపులను ఏర్పాటు చేయాలన్నారు. విజిలెన్స్ మరియు మానిటరింగ్ కమిటీ సభ్యులకు గుర్తింపు కార్డులను ఇవ్వాలని, దీని ద్వారా వారు క్షేత్రస్థాయిలో పర్యటించి గౌరవ ప్రదంగా సమస్యలు తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఎస్సీలకు సంబంధించి ఎన్ని కేసులు నమోదయ్యాయి, ఆర్థిక సహాయం, భూమిని ఎంత మందికి ఇచ్చారు, ఆయా శాఖల్లో పరిధిలో కారుణ్య నియామకాల్లో రోస్టర్ పాయింట్లు పాటించడం, తదితర అంశాలపై సమీక్షించడం జరిగింది.

ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మరియు మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాల వారి రక్షణ కోసం ఏర్పాటు చేసిన అట్రాసిటీ చట్టం లక్ష్యం నెరవేరేలా పోలీసులు పనిచేయాలని, ఎలాంటి ఒత్తిడికి తలొగ్గరాదని, తప్పుడు కేసులు నమోదు కాకుండా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. అట్రాసిటీ కేసు తీవ్రతను బట్టి బాధితులకు ఆర్థిక సహాయం, స్థలం ఇవ్వాలన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలు ప్రతినెల నిర్వహించే సివిల్ రైట్స్ డేలో పాల్గొనాలని, డివిజన్, మండల పరిధిలో అధికారులు క్రమం తప్పకుండా నిర్వహించాలని, అందరూ అధికారులు కూడా ఇందులో పాల్గొనేలా చూడాలన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు 2019 - 24 మధ్యలో దుర్వినియోగం అయ్యాయని, నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలని, సబ్ ప్లాన్ నిధులు సక్రమంగా వినియోగించాలని, ఎస్సీ కాలనీలలో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎస్సీ హాస్టల్స్ లో మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. రాష్ట్రంలో ఇళ్లు లేని దళితులు ఉండరాదనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని, అందుకు అనుగుణంగా జిల్లాలోని ఎస్సీ కాలనీలలో సచివాలయ అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ఇల్లు కావాలా, స్థలం, పట్టా కావాలా అని అడగాలని, ఒకరోజు ఈ కార్యక్రమాన్ని డ్రైవ్ లా చేపట్టాలన్నారు. సమగ్ర శిక్షలో సెక్టోరియల్ అసిస్టెంట్ల నియామకంలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ నిబంధనల మేరకు పాటించాలన్నారు. మూడు నెలల తర్వాత శాసనసభ కమిటీ ఇక్కడికి మళ్లీ రావడం జరుగుతుందని, ఆలోపు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. జిల్లాలో బాగా పనిచేస్తున్న జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలకు ప్రశంసలు తెలిపారు. పలువురు జిల్లా అధికారులు వారి శాఖ నుండి ఎస్సీల సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలు రోస్టర్ అంశాలు కమిటీకి వివరించారు. అనంతరం శాసనసభ కమిటీ అధ్యక్షులు, సభ్యులను, జిల్లా కలెక్టర్, ఎస్పీ, సోషల్ వెల్ఫేర్ జెడిలు శాలువా కప్పి సముచితంగా సన్మానించ

ఈ సమావేశంలో డిఆర్ఓ ఏ.మలోల, తాడిపత్రి ఏఎస్పి రోహిత్ కుమార్ చౌదరి, జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, ఆర్డీఓలు వసంతబాబు, కేశవనాయుడు, శ్రీనివాస్, డిఎస్పీలు శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, రవికృష్ణ, శ్రీనివాస్, సిపిఓ అశోక్ కుమార్, సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ, జిల్లా వ్యవసాయ అధికారు ఉమామహేశ్వరమ్మ, హౌసింగ్ పీడీ శైలజ, డిఈఓ ప్రసాద్ బాబు, డిఎండబ్ల్యూఓ రామ సుబ్బారెడ్డి, హార్టికల్చర్ డీడి ఉమాదేవి, జడ్పీ సీఈవో శివశంకర్, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ రామునాయక్, ఏఎస్డబ్ల్యూవోలు రామ్మోహన్, శ్రీనివాసులు, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మొంథా' తుఫాను ప్రభావిత ప్రాంతాల పరిశీలన

- విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్




**అంకుశం ప్రతినిధి విశాఖపట్నం అక్టోబర్ 28:** 'మొంథా' తుఫాను వలన పట్టణంలో ప్రభావితమయ్యే లోతట్లు ప్రాంతాలైన ఐస్ ఫ్యాక్టరీ జంక్షను, లోవర్ ట్యాంకు బండ్ రోడ్డు, పెద్ద చెరువును జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, జిల్లా కలెక్టరు ఎస్. రామసుందర్ రెడ్డి అక్టోబరు 28న సంయుక్తంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు ఎస్.రామసుందర్ రెడ్డి మాట్లాడుతూ - తుఫాను ప్రభావం వలన ఇబ్బందులు తలెత్తే లోతట్టు ప్రాంతాలను పరిశీలించి, అవసరమైన సహాయక చర్యలను చేపడుతున్నామన్నారు. తుఫాను కారణంగా ఏమైనా ఇబ్బందులు తలెత్తినా, వాటిని ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగాన్ని సమాయత్తం చేసామన్నారు. ఇప్పటికే జేసిబిలు, ఇతర పరికరాలను సహాయక బృందాలకు అందుబాటులో ఉంచామన్నారు. ముఖ్యంగా సింగిల్ రోడ్డు కలిగిన గ్రామాల్లో ప్రజలకు ఆరోగ్యపరమైన అత్యవసర పరిస్థితులు ఏర్పడితే వారిని సకాలంలో వైద్యం కోసం తరలించేందుకు 108 అంబులెన్సులను అందుబాటులో ఉంచామన్నారు. ఇతర శాఖల సమన్వయంతో సహాయ చర్యలు చేపట్టే విధంగా అన్ని ఏర్పాట్లు చేసామని జిల్లా కలెక్టరు ఎస్. రామసుందర రెడ్డి తెలిపారు.జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ - తుఫాను కారణంగా బలంగా వీచే ఈదురు గాలులు, వర్షాల వలన జలమయమయ్యే ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఇతర శాఖలతో సమన్వయంతోపని చేస్తున్నామన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురి చేయాలనే దురుద్దేశ్యంతో కొంతమంది ఆకతాయిలు సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడుతున్నారన్నారు. ఇటువంటి వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వదంతులను నమ్మవద్దన్నారు. వదంతులను సృష్టించే వ్యక్తులను గుర్తించి, వారిపై కేసులను నమోదు చేయడంతోపాటు రౌడీ షీట్లను ప్రారంభిస్తామన్నారు. చెరువు గట్లు, కట్టలు తెగిపోయాయి అని, వరద గ్రామాల్లోకి వచ్చేస్తుందని, సహాయక కేంద్రాల్లో డబ్బులు ఇస్తున్నారని వదంతులు సృష్టిస్తున్నారన్నారు. ఇటువంటి అవాస్తవ ప్రచారాలను నమ్మ వద్దని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. జిల్లా కలెక్టరు మరియు తాను చెప్పే విషయాలనే ప్రజలు ప్రాతిపదికగా తీసుకోవాలని, అవాస్తవాలతో ప్రజలను ఆందోళనకు గురి చెయ్యవద్దని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ కోరారు.జిల్లా కలెక్టరు, జిల్లా ఎస్పీల వెంట మున్సిపల్ కమీషనరు నల్లనయ్య, ఎస్బీ సిఐ ఎ.వి.లీలారావు, ట్రాఫిక్ సిఐ సీహెచ్.సూరి నాయుడు, 1వ పట్టణ సిఐ ఆర్.వి.ఆర్.కే.చౌదరి, 2వ పట్టణ సిఐ టి.శ్రీనివాసరావు మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.

## సొంత ఆదాయవనరులను సమకూర్చుకోవాలి -ఎంపీడీఓ బి.విజయలక్ష్మి



**రాప్తాడు, అంకుశం న్యూస్ అక్టోబర్ 28:** గ్రామపంచాయతీలో సొంత ఆదాయ వనరులను సమకూర్చుకునేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని ఎంపీడీఓ బి. విజయలక్ష్మి సూచించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లకు డిప్యూటీ ఎంపీడీఓలు బి. అశోక్ బాబు, సాకే ప్రేమ్ కుమార్ లతో కలిసి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి ఏటా ఇంటి పన్ను, నీటి పన్నులు కట్టించుకోవడంతో పాటు లైసెన్స్లు, స్థానిక సేవలకు ఫీజులు, అలాగే క్వారీలు (ఇసుక, మట్టి) వంటి సహజ వనరుల ద్వారా వచ్చే సమకూరే ఆదాయాలపై దృష్టి సారించాలన్నారు.

## నగరంలోని 28 పార్కులను అభివృద్ధి చేస్తాం..

- ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్
- నీరు-ప్రగతి పార్కును పరిశీలించిన ఎమ్మెల్యే దగ్గుపాటి, కమిషనర్
- కూటమి ప్రభుత్వం వచ్చాక 60లక్షలతో పార్కులో పనులు చేశాం



**అంకుశం న్యూస్ అనంతపురం అక్టోబర్ 28:** అనంతపురం నగర ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా 28పార్కులను అభివృద్ధి చేస్తామని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఉదయం ఆయన శ్రీనగర్ కాలనీలోని నీరు ప్రగతి పార్కును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ బాలస్వామి ఇతర అధికారులు పాల్గొన్నారు. మార్నింగ్ వాకర్స్, సీనియర్ సిటిజన్స్ తో కలిసి పార్కు మొత్తం తిరిగారు. వాకింగ్ ట్రాక్, జిమ్ పరికరాలను పరిశీలించారు. కొన్ని పరికరాలు దెబ్బ తినడంపై చూసి వెంటనే వాటిని మార్చాలని మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. పార్కులు షెడ్డుతో పాటు ఇతర సౌకర్యాలు కావాలని విజ్ఞప్తి చేయగా వాటిని త్వరలోనే నిర్మిస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ 2014-19 కాలంలో ఈ పార్కును ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే కొత్తగా పనులు చేపట్టినట్టు చెప్పారు. 60 లక్షలతోనే వాకింగ్ ట్రాక్, బెంచీలు, కాంపౌండ్ వాల్ హైట్ పెంచడం వంటి పనులు చేసినట్లు వివరించారు. ప్రజల సొమ్మును ఆదా చేస్తూ పనులు చేస్తున్నట్లు చెప్పారు. నగరంలో మొత్తం 28 పార్కులు ఉన్నాయని.. వాటిని అభివృద్ధి చేస్తామన్నారు. ఇప్పటికే చాలా వరకు పనులు చేశామని.. ఇంకా చేయాల్సిన వాటిపై ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. రాజీవ్ కాలనీలో యోగా కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నగరంలో ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే విధంగా పార్కులు చాలా అవసరమన్నారు. కచ్చితంగా వీటిని అభివృద్ధి చేస్తామన్నారు. నగరంలో ప్రధాన రహదారుల్లో మహిళల కోసం సులబ్ కాంప్లెక్స్ లో నిర్మిస్తున్నట్లు తెలిపారు. 9 చోట్ల స్థలాలను గుర్తించామని చెప్పారు. ఆక్రమణలపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే దగ్గుపాటి స్పష్టం చేశారు...

# ప్రజల ప్రాణాలను నిలబెట్టడం మా కర్తవ్యం






- జిల్లా ఎస్పీ పి.జగదీష్
- రక్తదానం చేసిన జిల్లా ఎస్పీ జగదీష్
- జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్ లో రక్తదాన శిబిరం... సుమారు 200 మంది రక్తదానం

**అంకుశం క్రైమ్ న్యూస్ అనంతపురం అక్టోబర్ 28:** ప్రజల భద్రత, రక్షణలతో పాటు ప్రాణాలను నిలబెట్టడం మా కర్తవ్యమని జిల్లా ఎస్పీపి.జగదీష్ పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో జిల్లా ఎస్పీ జగదీష్ రక్తదానం చేశారు. పోలీసు అమర వీరుల వారోత్సవాలలో భాగంగా ఈరోజు జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్ లోని షాదీఖానాలో రక్తదాన శిబిరం నిర్వహించారు. జిల్లా ఎస్పీ గారు ముఖ్య అతిథిగా పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. జిల్లా ఎస్పీ గారు రక్తదానం చేశారు. అనంతరం మాట్లాడారు. పోలీసు అమర వీరుల వారోత్సవాలలో భాగంగా జిల్లా వ్యాప్తంగా పలు కార్యక్రమాలు చేపట్టామన్నారు. రక్తదానం చేయడం అంటే ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి పునర్జన్మ కల్పించడమేనని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలు, ప్రసవాలు, ఆపరేషన్ల సమయంలో రక్తం పాత్ర కీలకం అవుతుందన్నారు. అలాంటి ఆపద సమయంలో మానవత్వంతో రక్తదానం చేసి ప్రాణాలు కాపాడటం అదృష్టంగా భావించాలన్నారు. ఈనేపథ్యంలో రక్తదానం చేయడంపై ప్రజలకు అవగాహన కల్గించాలన్నారు. జిల్లా ఎస్పీ గారితో సి.ఐ లు ధరణీకిశోర్ , క్రాంతికుమార్ , వెంకటేశ్వర్లు, రాజేంద్రనాథ్ యాదవ్... ఆర్ ఐ లు పవన్ కుమార్, మధు, ఎస్సై , రుష్యేంద్రబాబు, ఆర్ ఎస్ ఐ మగ్బుల్ లు రక్తదానం చేశారు. ఈరోజు మొత్తం 200 రక్తదానం చేశారు. జిల్లా సర్వజన ఆసుపత్రిలోని బ్లడ్ బ్యాంకు సిబ్బంది, డాక్టర్లు దాతలు నుండీ రక్తంస్వీకరించారు. ఈకార్యక్రమంలో ఏ.ఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా, అనంతపురం డీఎస్పీ వి.శ్రీనివాసరావు, ఏ.ఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, సి.ఐ లు వెంకటేశ్వర్లు, రాజేంద్రనాథ్ యాదవ్ , ఆర్ ఐ లు పవన్ కుమార్ , మధు, పోలీస్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్ ఎస్ ఐ లు బాబ్జాన్ , మగ్బుల్ , రమేష్ నాయక్ , జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్ ఎస్ ఐ జాఫర్ , సుధాకర్ రెడ్డి, గాండ్ల హరినాథ్ , లక్ష్మినారాయణ, శివకుమార్, పోలీసు సిబ్బంది మరియు నగరంలోని పలు విద్యాసంస్థలకు సంబంధించిన విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు

# కంట్రోల్ రూమ్ సిబ్బంది 24/7 ప్రకారం అప్రమత్తంగా ఉండాలి


- ప్రభుత్వ “అవేర్” వెబ్సైట్ ను గమనిస్తూ... ఎప్పటికప్పుడు అందులోని సూచనలు అధికారులకు సమాచారం అందజేయాలి
- జిల్లా కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్



**అంకుశం ప్రతినిధి పుట్టపర్తి, అక్టోబరు -28:** మొంథా తుఫాను నేపథ్యంలో... కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ సిబ్బంది 24/7 ప్రకారం అప్రమత్తంగా ఉండి, తుఫానుకు సంబంధించి ఏదైనా సమాచారం అందగానే సంబంధిత అధికారులకు తెలియజేసే విధంగా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ కంట్రోల్ రూమ్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఉదయం మొంథా తుఫాను నిమిత్తం కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ను జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కంట్రోల్ రూమ్ లో డిజాస్టర్ మేనేజ్మెంట్ కు సంబంధించి ఏఏ శాఖలు సిబ్బంది ఉన్నారు, కేటాయించిన అందరూ విధులలో ఉన్నారా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా కంట్రోల్ రూమ్ లో వ్యవసాయం, విద్యుత్, పంచాయితీ రాజ్, జి ఎస్ డబ్ల్యు ఎస్, వైద్యారోగ్యం, అగ్నిమాపక సిబ్బంది కంట్రోల్ రూమ్ లో విధుల్లో ఉన్నట్టు అక్కడి సిబ్బంది కలెక్టరుకు వివరించారు. కంట్రోల్ రూమ్ లో ఏర్పాటు చేసిన 08555-289039 ల్యాండ్ లైన్ నెంబర్ పనిచేస్తుందా లేదా అని చెక్ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... ఒకవేళ ల్యాండ్ లైన్ బిజీగా ఉన్నప్పుడు.. కంట్రోల్ రూమ్ లో విధుల్లో ఉన్న సిబ్బంది అందరి మొబైల్ నెంబర్లు సంబంధిత శాఖలు మరియు తాసిల్దార్ లందరి వద్ద ఉండాలని సూచించారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వ “అవేర్” వెబ్ సైట్ ను గమనిస్తూ.. అందులోని ఐ ఎం డి వాతావరణ శాఖ అలర్టులను అధికారులకు తెలియజేయాలన్నారు. అలాగే ఎప్పటికప్పుడు రైన్ ఫాల్ ఎంత ఉంది ఎక్కడైనా రోడ్లు దెబ్బతిన్నాయా, చెరువులు వాగులు వంకలు ఓవర్ ఫ్లో అవుతున్నాయా, విద్యుత్ సరఫరాలో అంతరాయం, ప్రాణ, ఆస్తి, పంట, ఇళ్ల డ్యామేజెస్ సంబంధించి ఎప్పటికప్పుడు సమాచారం తీసుకోవాని సంబంధితలందరినీ అప్రమత్తం చేయాలన్నారు. సోషల్ మీడియాలో కూడా యాక్టివ్ గా ఉండాలని సూచించారు. అనంతరం వివిధ అంశాలలో తగు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ సూర్యనారాయణ రెడ్డి, రెవెన్యూ, కంట్రోల్ రూమ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలోని బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు అమలుపరచాలి.

- రాష్ట్ర బీసీ మహిళా సంఘం అధ్యక్షురాలుశ్రీ మతి సంకారపు జయశ్రీ



**అంకుశం న్యూస్ ధర్మవరం అక్టోబర్ 28:** రాష్ట్రంలోని బీసీలకు 33 శాతమురిజర్వేషన్ను అమలు చేయాలని రాష్ట్ర బీసీ మహిళా సంఘం అధ్యక్షురాలు సంకారపు జయ శ్రీ, బీసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి చింతా నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా వారు సంకారపు జయ శ్రీ స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 29న తిరుపతిలో నిర్వహించబడే నిరసన లో అన్నమయ్య సర్కిల్ తిరుపతి ఆర్డిఓ కార్యాలయ ముందు ఒకరోజు రిలే నిరాహార దీక్షలకు తాము మద్దతు పలుకుతున్నామని, ఈ దీక్షకు రాష్ట్రంలోని బీసీలందరూ కూడా తండోపతండాలుగా వచ్చి జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. తాము ఇది వరకే విజయవాడ వైజాగ్ లో మహాసభలతో పాటు దీక్షలు కూడా చేయడం జరిగిందని ఇందుకు స్పందన కూడా రావడం జరిగిందని వారు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ దీక్షలు బిసి ఉద్యమాలకు నాంది పలుకుతుందని తెలిపారు. 33 శాతాన్ని బీసీలకు ప్రధానమంత్రి మోడీ ఆమోదించడం జరిగిందని, ఇంతవరకు చట్టముకు నోచుకోలేదని తెలిపారు. ఇప్పటికే అగ్రవర్ణాల కులాలు రాజకీయాల్లోకి రావడం మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు కావడం జరిగిందని, కానీ బీసీలు మాత్రం ఓట్లు వేసేందుకే పరిమితమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం బీసీలు 70 శాతం ఉన్నారని, ఓ బి సి కూడా తెలపాలని వారు డిమాండ్ చేశారు. మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని వచ్చే ఎన్నికల్లో బీసీ సత్తా చూపిస్తామని తెలిపారు. బీసీ రక్షణ చట్టం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కల్పిస్తానని తెలిపి,ఇంతవరకు వాటిని అమలుపరచలేక పోవడం దారుణమన్నారు. కావున 29న తిరుపతిలో జరిగే నిరాహారదీక్షకు తండోప తండాలుగా బిసి సోదర, సోదరీమణులు, ఉద్యోగ సంఘాల వారు పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలోరాష్ట్ర బీసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి చింతా నాగరాజు గద్దం పార్థసారథి, బీసీ నాయకులు బీసీ మల్లన్న,వడ్డే రవి, బండి వెంకటేస్, బిటి కొండయ్య, పాల్గొన్నారు.

# పంటలవారీగా ప్రణాళికలు రూపొందించుకోవాలి




- రైతు సాగు చేస్తున్నటువంటి పద్ధతిలో ఉన్నటువంటి గ్యాస్ ని గుర్తించాలి
- కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ కోపరేషన్ మరియు పీఎండీడీకేవై జిల్లా నోడల్ అధికారి సిద్ధార్థ జైన్

**అంకుశం ప్రతినిధి అక్టోబర్ 28:** రైతుల ఆదాయాన్ని పెంచేందుకు.. పంటలవారీగా ప్రణాళికలు రూపొందించుకోవాలని కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ కోపరేషన్ మరియు పీఎండీడీకేవై జిల్లా నోడల్ అధికారి సిద్ధార్థ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు.
మంగళవారం సిద్ధార్థ జైన్ ఐఏఎస్ జాయింట్ సెక్రెటరీ మినిస్ట్రీ ఆఫ్ కోపరేషన్ న్యూఢిల్లీ మరియు డిస్ట్రిక్ట్ నోడల్ ఆఫీసర్ ప్రధానమంత్రి దన్ దన్ ధాన్య కృషి యోజన పథకము వారు, శ్రీ సత్యసాయి జిల్లా క్షేత్ర సందర్శనకు రావడం జరిగింది. ఇందులో భాగంగా చిలమత్తూరు మండలంలోని మరవ కొత్తపల్లి గ్రామంలో రైతులు సాగుచేసిన మొక్కజొన్న ,మల్బరీ పంటలను పరిశీలించడం జరిగినది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల యొక్క ఆదాయాన్ని పెంచడంతోపాటు పంటలలో దిగుబడి పెంచాలని అందుకు సంబంధించి పంటల వారీగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ముఖ్యంగా రైతు సాగు చేస్తున్నటువంటి పద్ధతిలో ఉన్నటువంటి గ్యాస్ ని గుర్తించి వాటికి అధిగమించడానికి తీసుకోవాల్సిన అటువంటి చర్యలను రైతు వారీలుగా చేపట్టాలన్నారు. అదేవిధంగా ప్రతి పంటలో విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు దిశగా రైతులను ప్రోత్సహించాలన్నారు. మొక్కజొన్న సాగు చేస్తున్నటువంటి రైతు మదన్ మోహన్ రెడ్డి గారితో మాట్లాడుతూ వారు వారు ఆచరిస్తున్నటువంటి పద్ధతులను పంట దిగుబడులను అడిగి తెలుసుకున్నారు. రైతులు మాట్లాడుతూ మొక్కజొన్నకి ప్రభుత్వం వారు మద్దతు ధరతో కొనుగోలు చేసేటట్లు చూడాలన్నారు అదే విధంగా రైతులకి రాయితీ మీద సూక్ష్మ పోషకాలు అందిస్తే మరింత దిగుబడును సాధించడానికి వీలవుతుందని అన్నారు. శ్రీ సిద్ధార్థ జైన్ గారు మాట్లాడుతూ ప్రతి రైతు కూడా మార్కెట్ ఓరియెంటెడ్ గా పంటలు పండించాలని కోరారు. అదేవిధంగా ప్రభాకర్ రెడ్డి గారి పొలంలో సాగు చేస్తున్నటువంటి మల్బరీ పంటని పరిశీలించి సాగు విధానాన్ని అడిగి తెలుసుకోవడం జరిగినది. అదేవిధంగా బీడు భూములలో మరియు గట్ల మీద చింత సాగును ప్రోత్సహించాలన్నారు దానివల్ల కుటుంబానికి ఉపాధితో పాటు ప్రత్యామ్నాయ ఆదాయం కూడా పొందవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ ఆర్డిఓ ఆనంద్ హిందూపురం ఏడి ఏ కృష్ణయ్య , జిల్లా సహకార అధికారి శ్రీకృష్ణ నాయక్ చిలమత్తూ రూ వ్యవసాయ అధికారి శ్రీమతి కవిత రాణి హార్టికల్చర్ ఆఫీసర్ మహేష్ మరియు రైతులు పెద్ద సంఖ్యలు పాల్గొన్నారు.

## సత్య సాయి జిల్లా ఎస్ పి ని కలిసిన జనసేన రాష్ట్రప్రధాన కార్యదర్శి చిలకం మధుసూధన రెడ్డి



**అంకుశం న్యూస్ ధర్మవరం అక్టోబర్ 28:** శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం జిల్లా శాంతి భద్రతల అంశంపై చర్చించారు. శాంతి భద్రతలపై జిల్లా ఎస్ పి చేస్తున్న కృషి ని అభినందించారు.

## మోంథా తుఫాన్ తో జాగ్రత్త!

-ప్రజలు అప్రమత్తంగా వుండాలి
- డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి



**పోరుమామిళ్ల,అక్టోబర్ 28(అంకుశం పత్రిక):** మోంథా తుఫాన్ తీవ్రస్థాయిని దాల్చిందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాజీ ఆప్కాస్ స్టేట్ బోర్డు మెంబర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి ప్రజలను హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పోరుమామిళ్ల మండల ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా పాత ఇళ్ళు, మట్టి మిద్దెలు కూలడానికి, పడిపోవడానికి అవకాశమున్నందున, ఏమైనా జరగడానికి అవకాశం ఉన్నందున అలాంటి ఇళ్లలో నివసిస్తున్న ప్రజలు దయచేసి అక్కడ ఖాళీ చేసి మీకు దగ్గరలోని సురక్షితమైన ప్రదేశంలోని ఇళ్లలోకి చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఇళ్ల దగ్గర కానీ, పొలాల దగ్గర కానీ తడి చేతులతో లేక తడి బట్టలతో కరెంటు ఆన్, ఆఫ్ చేయడం ప్రమాదకరం అన్నారు. అలాగే ఎక్కడైనా వంకలు, వాగులు దాటేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకొని ప్రమాదాల బారిన పడకుండా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

## అక్టోబర్ 30న శ్రీవారి ఆలయంలో పుష్పయాగం

**అంకుశం న్యూస్ తిరుమల అక్టోబర్ 28:** తిరుమల శ్రీవారి ఆలయంలో అక్టోబర్ 30న గురువారం పుష్పయాగ మహోత్సవం శాస్త్రోక్తంగా జరుగనుంది. అక్టోబర్ 29న బుధవారం రాత్రి 8 నుండి 9 గంటల వరకు పుష్పయాగానికి అంకురార్పణను వసంత మండపంలో నిర్వహించనున్నారు. అంతకు మునుపు మృత్సంగ్రహణం, ఇతర పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పుష్పయాగం రోజున ఆలయంలో రెండవ అర్చన, రెండవ గంట, నైవేద్యం అనంతరం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి ఉత్సవర్లను సంపంగి ప్రదక్షిణలోని కల్యాణ మండపానికి వేంచేపు చేసి స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు తదితర సుగంధద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేస్తారు. మధ్యాహ్నం 1 నుంచి 5 గంటల వరకు వివిధ రకాల పుష్పాలు, పత్రాలతో వేడుకగా పుష్పయాగం నిర్వహిస్తారు. సాయంత్రం సహస్రదీపాలంకార సేవ తరువాత ఆలయ నాలుగు మాడ వీధుల్లో శ్రీమలయప్పస్వామివారు భక్తులకు దర్శనమిస్తారు.

**ఆర్జిత సేవలు రద్దు**

అక్టోబర్ 29న అంకురార్పణ కారణంగా సాయంత్రం సహస్రదీపాలంకార సేవను టీటీడీ రద్దు చేసింది.అక్టోబర్ 30 పుష్పయాగం రోజున తిరుప్పావడ సేవ, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవ సేవలు రద్దయ్యాయి. తోమాల, అర్చన సేవలు ఏకాంతంగా నిర్వహిస్తారు.

## ఘోర విమాన ప్రమాదం..

## 12మంది దుర్మరణం

**నైరోబి:** కెన్యాలో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో 12మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. మంగళవారం ఉదయం కెన్యాలోని క్వాలే కౌంటీలో విమానం కూలింది. పర్యాటకులతో ప్రయాణిస్తున్న విమానం డయాని నుండి మాసాయి మారాలో కిచ్వా టెంబోకు బయలుదేరింది. అయితే బయలుదేరిన కొద్దిసేపటికే కూలిపోయింది. విమాన ప్రమాదాన్ని కెన్యా పౌర విమానయాన అథారిటీ (కేసీఏఏ) ధృవీకరించింది. ఈ మేరకు ఓ ప్రకటనను విడుదల చేసింది. ‘డయాని నుండి కిచ్వా టెంబోకు వెళుతున్న 5%-జజూ% రిజిస్ట్రేషన్ నంబర్ కలిగిన విమానం ఉదయం 8.30 గంటల సమయంలో కూలిపోయింది. విమానంలో 12మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రమాదానికి గల కారణాలు , దాని ప్రభావాన్ని నిర్ధారించేందుకు ప్రభుత్వ అధికారులు ప్రమాదం జరిగిన ప్రదేశానికి వెళ్లారు’ అని కెన్యా సివిల్ ఏవియేషన్ అథారిటీ ప్రకటనలో పేర్కొంది. పోలీసుల ప్రకారం.. విమాన ప్రమాదంలో మరణించిన 12 మంది ప్రయాణికులు పర్యాటకులని తేలింది. ప్రమాదానికి ఖచ్చితమైన కారణాన్ని పరిశీలించడానికి,దర్యాప్తు చేయడానికి ప్రభుత్వ సంస్థలు ఇప్పటికే సంఘటనా స్థలానికి చేరుకున్నాయని కేసీఏఏ డైరెక్టర్ ఎమిలే ఎన్.రావు తెలిపారు. ప్రమాదానికి ఖచ్చితమైన కారణం ఇంకా నిర్ధారించబడినప్పటికీ, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఈ విషాదం చోటు చేసుకుందని స్థానిక మీడియా కథనాలు వెలుగులోకి వచ్చాయి. ఉదయం నుండి, తీరప్రాంతం పొగమంచు, మేఘాలతో కప్పబడి ఉండటం వల్ల పైలట్ నియంత్రణ కోల్పోయి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తూ కథనాల్లో హైలెట్ చేశారు.

## రేవంత్ సూచనలతో లొంగిపోయాము

## అజ్ఞాతం వీడిన చంద్రన్నా, బండి ప్రకాశ్

**హైదరాబాద్ :** తెలంగాణ డీజీపీ ముందు మావోయిస్టు కీలక నేతలుప్రసాదరావు అలియాస్ చంద్రన్న, రాష్ట్ర కమిటీ సభ్యుడు బండి ప్రకాశ్ సరెండర్ అయ్యారు. మావోయిస్టు లొంగుబాటులో తెలంగాణ ూఎః కీలక ఆపరేషన్ నిర్వహిస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి పిలుపు మేరకు చంద్రన్న అజ్ఞాతం వీడారు. జనజీవన స్రవంతిలో కలవాలని నిర్ణయించుకున్నారు. చంద్రన్న కేంద్ర కమిటీలో కీలక సభ్యుడిగా పనిచేశారు. అనారోగ్య పరిస్థితులు.. ఆపరేషన్ కగార్ వల్ల తాము లొంగిపోయామని మావోయిస్టులు చెప్పారు. రేవంత్ సూచనాలతోనే జనజీవన స్రవంతిలోకి వస్తున్నామన్నారు. అయితే ఇది లొంగుబాటు కాదు.. రాబోయే రోజుల్లో ప్రజల కోసమే వస్తున్నామని స్పష్టం చేశారు. తాము ఎలాంటి డబ్బులు ఆశించడం లేదన్నారు. చాలా మంది చనిపోయారు.. మా సిద్ధాంతం మేరకు ముందుకెళ్తున్నామని చెప్పుకొచ్చారు. మావోయిస్టు పార్టీలో అంతర్గత చీలికలు జరిగాయని సరెండర్ నక్సలైట్లు తెలిపారు. దేవోజి సీపీఐ మావోయిస్టు కార్యదర్శిగా ఉన్నారు.. ఎవరి మార్గం వాళ్ళు ఎంచుకున్నారు.. మేము ఎంచుకున్నామని బండి ప్రకాష్, చంద్రన్న తెలిపారు. సోని వర్గం మమ్మల్ని వ్యతిరేకేస్తోందని.. మాకు కూడ ప్రజాల మధ్య పనిచేసే క్యాడర్ ఉంది.. దేశమంతా పనిచెయ్యడానికి ఉందని తెలిపారు. ఇప్పటివరకు ఉద్యమంలో పీడిత ప్రజల కోసమే పని చేశామని , భవిష్యత్తులో కూడా ప్రజల కోసమే పని చేస్తామని తెలిపారు. మా సిద్ధాంతం ఓడిపోలేదు, ఓడించడం ఎవరితరం కాదని వారు తెలిపారు. మా భావాజాలంతో భవిష్యత్తులో మరింత మంది ముందుకు వచ్చే అవకాశం ఉందని.. ప్రజల మధ్య ఉండి సేవ చేయాలనుకున్నామన్నారు. ఆయుధాలను పార్టీకి ఇచ్చి వచ్చామని తెలిపారు. చంద్రన్నా, బండి ప్రకాశ్ అజ్ఞాతం వీడారని.. తెలంగాణ ప్రభుత్వం పిలుపు మేరకు అజ్ఞాతం నుండి బయటికి వచ్చి జనజీవన స్రవంతి లో కలిశారని డీజీపీ శివధర్ రెడ్డి ప్రకటించారు. పుల్లూరి ప్రసాద్ రావ్ ఏ చంద్రన్నా ది పెద్దపల్లి మండలం , 15 ఏళ్ల కేంద్ర కమిటీ సభ్యుడి గా ఉన్నాడు. మొదట రాడికల్ స్టూడెంట్ గా తన ప్రస్థానాన్ని స్టార్ట్ చేశాడు . 1980 లో కిషన్ జీ కి కొరియర్ గా చేశాడు. 2008 లోనే కేంద్ర కమిటీ మెంబర్ గా చంద్రన్న ఉన్నాడు. 2024 డిసెంబర్ వరకు తెలంగాణ స్టేట్ కమిటీ సెక్రటరీ గా ఉన్నాడని డీజీపీ తెలిపారు. అక్టోబర్ 21 నాడు సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు చంద్రన్న జన జీవన స్రవంతి లో కలిశాడని.. చంద్రన్నా ఆరోగ్యం కూడా సహకరించకపోవడం తో అజ్ఞాతం వీడారన్నారు.